
సాక్షి
వికారాబాద్
ఆదివారం । 3 । నవంబర్ । 2024



మారుతున్న అగ్రి'కల్చర్'

గతంలో వ్యవసాయం చేయాలంటే కాడెద్దులు, కలవతో తయారు చేసిన పరికరాలు వాడేవారు.

8లో▸



రెచ్చిపోతున్న దొంగలు

బషీరాబాద్ మండలంలో దొంగలు రెచ్చిపోతున్నారు. వరుస చోరీలతో ప్రజలు హడలిపోతున్నారు.

8లో▸



సస్యరక్షణతో దిగుబడి..

వేరుశనగ పంట సాగుకు నవంబర్ చివరి వరకు అనుకూలమని వ్యవసాయాధికారులు సూచించారు.

9లో▸

న్యూస్‌రీల్

ప్రపంచం చూపు భారత్‌వైపు

గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్



పార్టీలో చేరిన వారికి సభ్యత్వ నమోదు పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పరిగి: ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ అన్నారు. శనివారం పార్టీ పరిగి పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని యువత బీజేపీ వైపే ఉందన్నారు. ప్రజలు మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రధాని సంకల్పించి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రజల మద్దతు మరింత అవసరం అన్నారు. ఇందుకోసం ప్రజలు బీజేపీలో చేరి మద్దతు తెలపాలన్నారు. దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరినాయక్, శంకర్‌నాయక్, నాయకులు రాజునాయక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సనాబేగం



ధారూరు: మండలంలోని నాగసమందర్ గ్రామానికి చెందిన విద్యార్థిని సనాబేగం అండర్ -14 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఇటీవల వికారాబాద్‌లో జరిగిన అండర్ -14 జిల్లా స్థాయి పోటీల్లో, అలాగే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో జరిగిన పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.

అంకితభావంతో పనిచేయాలి

ఎస్పీ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: హోంగార్డులు కూడా పోలీస్ శాఖలో భాగమేనని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శనివారం తన కార్యాలయంలో జిల్లాలోని హోంగార్డులతో సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటిస్తూ, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. అంకితభావంతో పనిచేయాలన్నారు. పైస్థాయి అధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు కలిసికట్టుగా పనిచేయాలని అప్పుడే పోలీసు శాఖకు మంచి పేరు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ డేవిడ్, జిల్లా హోంగార్డుల సంఘం అధ్యక్షుడు సుధాకర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చాంద్‌పాషా పాల్గొన్నారు.

పోక్సో కేసు నిందితులకు రిమాండ్

దోమ: బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన ఘటనలో అరెస్టయిన ఐదుగురు నిందితులను శనివారం రిమాండ్‌కు తరలించారు. దోమ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై ఇదే ఊరికి చెందిన ముగ్గురు యువకులతో పాటు ఇద్దరు మైనర్లు లైంగిక దాడికి పాల్పడ్డారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

సదర్ ఉత్సవానికి ప్రత్యేక గుర్తింపు

షాద్‌నగర్: యాదవ సామాజిక వర్గం అత్యంత వైభవంగా నిర్వహించే సదర్ ఉత్సవానికి ప్రత్యేకమైన గుర్తింపు ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. యాదవ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన షాద్‌నగర్‌లో నిర్వహించే సదర్ సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యాదవుల సంస్కృతి, సంప్రదాయానికి సదర్ ఉత్సవం ప్రతీక అన్నారు. ప్రభుత్వం యాదవుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. యాదవులందరూ ఐకమత్యంగా ఉండి సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు.

కులగణనతో న్యాయం

బీసీ సామాజిక వర్గానికి ఎంతో మేలు

- ఈ ప్రక్రియ తర్వాతే సర్పంచ్ ఎన్నికలు
- శాసనమండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి
- అవగాహన సదస్సులో రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం
- కేడర్ సూచనలు పట్టించుకోని ముఖ్య నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న పట్నం మహేందర్‌రెడ్డి

వికారాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న బీసీ కులగణన ఎంతో గర్వించదగిన విషయమని శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్‌లోని సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన బీసీ కులగణన, కుటుంబ ఇంటింటి సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులగణనతో బీసీ సామాజిక వర్గానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కులాలకు సంబంధించి సరైన గణాంకాలు లేకపోవడంతోనే సర్పంచ్ ఎన్నికలు ఆగిపోయాయని తెలిపారు. కులగణనతో అన్ని వర్గాలకు రిజర్వేషన్లలో న్యాయం జరుగుతుందన్నారు.

భిన్నత్వంలో ఏకత్వం కాంగ్రెస్ సిద్ధాంతం: టీఆర్ఆర్

భిన్నత్వంలో ఏకత్వం కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సర్వే టీంకు కాంగ్రెస్ కేడర్ సహకరించాలన్నారు. ఎన్నికల సమయంలో బీసీలకు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీకి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగానే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కులగణన చేపడుతున్నామని తెలిపారు. నేడు దేశంలో కనిపిస్తున్న అభివృద్ధి అంతా కాంగ్రెస్ చలవేనని పేర్కొన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతి కోసమే కులగణన చేపతున్నట్లు వివరించారు. బీజేపీవి మోసపూరిత విధానాలని ఆరోపించారు. ఈ నెల 7న కలెక్టరేట్‌లో బీసీ కమిషన్ ఆధ్వర్యంలో కలగణనపై సలహాలు, సూచనలు తీసుకుంటారని, బీసీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సాహసోపేతమైన నిర్ణయం: బీఎమ్మార్

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న బీసీ కులగణన సాహసోపేత నిర్ణయమని తాండూరు ఎమ్మెల్యే బీ మనోహర్‌రెడ్డి అన్నారు. అన్ని వర్గాల పెద్దలు, మేధావులతో చర్చించి 53 రకాల సమాచారం ఈ సర్వే ద్వారా ప్రభుత్వం సేకరించనున్నట్లు తెలిపారు. సర్వేకి గ్రామాల్లోని కేడర్ సహకరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మంచి పని తలపెట్టినా బీజేపీ, బీఆర్ఎస్ అడ్డు తగులుతున్నాయని మండిపడ్డారు. ఈ సర్వేకు కూడా ఆటంకాలు కలిగిస్తున్నారని తెలిపారు. డీఎస్సీ, గ్రూప్ వన్ పరీక్షలు నిర్వహించకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు.

నేతల ప్రసంగాలు ఇలా..

'కులగణన చేస్తే తప్ప ఆయా సామాజిక వర్గాల జనాభా ఎంతో తెలియదు.. కాంగ్రెస్ పాలిత అన్ని రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం చేపట్టబోతున్నారు.. మొదటి నుంచి రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమే' అని మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. 'కాంగ్రెస్ పేదల పార్టీ.. బీసీలకు రిజర్వేషన్ కల్పించేందుకే కులగణన చేపట్టింది. చట్ట సభల్లోనూ బీసీలకు రిజర్వేషన్ కల్పించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలి.. మన జిల్లాలో బీసీ, ఎస్టీలకు ప్రాతినిథ్యం లేదు.. నామినేటెడ్ పదవుల్లోనూ బీసీలు వివక్షకు గురవుతున్నారు' అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాల్‌కృష్ణప్రసాద్ అన్నారు. 'బీసీ కులగణన సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలి' అని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న సూచించారు. 'ఇచ్చిన మాటకు కట్టుబడి రాహుల్ గాంధీ ఓబీసీ సర్వే చేయిస్తున్నారు' అని పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. 'స్వాతంత్ర్యం వచ్చాక బీసీలకు గణాంకాలే లేవు.. కులగణన అనేది వారికి శుభపరిణామం.. రిజర్వేషన్లు లేక వెనుకబాటుకు గురవుతున్నారు' అని డీసీసీ ప్రధాన కార్యదర్శి కే హన్మంతు అన్నారు. అనంతరం పీసీసీ జనరల్ సెక్రెటరీ రఘువీరారెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీగౌడ్, సీనియర్ నాయకుడు జాఫర్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యం సేట్, డీసీసీబీ మాజీ డైరక్టర్ భీంరెడ్డి తదితరులు ప్రసంగించారు.

రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం

అయితే సమావేశం నిర్వహణపై పలు విమర్శలు వినిపించాయి. బీసీ కులగణన అవగాహన పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో స్టేజిపైన మెజార్టీ ఓసీ నాయకులే ఉండటం.. బీసీలు ఐదారుగురే ఉండటంతో పలువురు విమర్శించారు. తాము సలహాలు ఇస్తే స్వీకరించనప్పుడు ఈ సమావేశం ఎందుకని ఓ బీసీ నాయకుడు మైకు మధ్యలో వదిలేసి వెళ్లిపోయారు. ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు సైతం రాజకీయ విమర్శలకే ప్రాధాన్యమిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

ధాన్యం కొనుగోలుకు సిద్ధంకండి

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- రేపటి నుంచి వడ్లు సేకరించాలని అధికారులకు ఆదేశం

అనంతగిరి: జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలని, సోమవారం నుంచి ప్రక్రియను ప్రారంభించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం సేకరణ, సీఎంఆర్‌పై తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరీ డి.ఎస్.చౌహాన్ అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమం అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రణాళిక బద్ధంగా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని, వారికి తాగునీరు, నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. గోనె సంచులు, టార్పాలిన్ షీట్లు, తేమ శాతాన్ని గుర్తించే పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. దొడ్డు, సన్న రకం వడ్లను వేర్వేరుగా సేకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సారంగపాణి, డిప్యూటీ డీఆర్‌డీఓ సరోజ తదితరులు పాల్గొన్నారు.

126 కొనుగోలు కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా ధాన్యం సేకరణకు 126 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు లింగ్యానాయక్ తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో 1,05,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వచ్చే అవకాశం ఉందని, ఇందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. క్వింటాలు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2,320 మద్దతు ధర ఇవ్వనున్నట్లు తెలిపారు. సాధారణ రకానికి రూ.2,300, అదే విధంగా సన్న రకం వడ్లకు అదనంగా 500 రూపాయలు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఎండబెట్టిన, చెత్త లేని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించారు.

'తహసీల్'కు వాస్తుదోషం!



- రెండేళ్లలో ఐదుగురు తహసీల్దార్ల బదిలీ
- మండలంలో పని చేసేందుకు ఆసక్తి చూపని అధికారులు
- ఫార్మా కంపెనీ ఏర్పాటూ ఓ కారణమే

దుద్యాల్: తహసీల్దార్ కార్యాలయానికి వాస్తు దోషం పట్టుకుంది. రాజకీయ నాయకుల ఒత్తిడో.. పని భారమో తెలియదు కానీ మండలానికి వచ్చిన తహసీల్దార్లు పట్టుమని నెల రోజులు కూడా ఉండటం లేదు. కొత్తగా ఏర్పాటైన దుద్యాల్ మండల కేంద్రంలో 2023 ఫిబ్రవరిలో తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటి వరకు ఏకంగా 5 మంది తహసీల్దార్లు బదిలీ అయ్యారు. మండలం ఏర్పాటయ్యాక తొలి తహసీల్దార్‌గా భీమయ్య గౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఈయన 1-02-2023 నుంచి 01-08-2023 వరకు 6 నెలల పాటు విధులు నిర్వహించి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తహసీల్దార్ గణేష్ విధుల్లో చేరారు. 01-08-2023 నుంచి 14-08-2023 వరకు కేవలం 14రోజులు పని చేసి బదిలీపై వెళ్లారు. ఆ తర్వాత ఆనంద్‌రావు 14-08-2023 నుంచి 04-10-2023 వరకు నెలా 20 రోజులు విధుల్లో ఉండి బదిలీపై వెళ్లారు. అనంతరం వైదానయ్య 04-10-2023 నుంచి 17-09-2024 వరకు 11 నెలల 13 రోజులపాటు తహసీల్దార్‌గా సేవలందించి మరో ప్రాంతానికి బదిలీ అయ్యారు. ఆ తర్వాత బాధ్యతులు చేపట్టిన తహసీల్దార్ బీ వెంకటేశ్ ప్రసాద్ 17-09-2024 నుంచి 29-10-2024 వరకు నెలా 13 రోజులుగా విధుల్లో కొనసాగి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆరో తహసీల్దార్‌గా కే కిషన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇలా రెండేళ్లు కూడా గడవకముందే ఏకంగా 5 మంది తహసీల్దార్లు బదిలీ కావడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారులు ఎందుకు స్థిరంగా ఉండలేకపోతున్నారు అనే ఆలోచన వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో కూడా తహసీల్దార్లు ఇలాగే బదిలీపై వెళ్లారు.

ఫార్మా కంపెనీ ప్రభావమా?

మండలంలో ఫార్మా కంపెనీ ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అయితే భూములు కోల్పోయే లగచెర్ల, హకీంపేట్, పోలేపల్లి, రోటిబండ తండా, పులిచెర్ల తండా గ్రామాల రైతులు ఫార్మా కంపెనీ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. భూముల సర్వే కోసం వెళ్లే అధికారులను అడ్డుకోవడం, నిలదీయడం వంటివి చేస్తున్నారు. ఇటీవల గొడవలు కూడా జరిగాయి. ఈ కారణంగా కూడా అధికారులు తమకెందుకులే అని ఇక్కడి నుంచి బదిలీపై వెళుతున్నట్లు తెలిసింది.

అనంతగిరి పెద్ద జాతరకు రండి

స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ఆహ్వాన పత్రిక అందజేసిన ఆలయ నిర్వాహకులు



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ప్రసాదం అందజేస్తున్న ఆలయ ట్రస్ట్ సభ్యులు

అనంతగిరి: ఈ నెల 11 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న అనంతగిరి గుట్ట శ్రీ అనంత పద్మనాభ స్వామి కార్తీకమాస పెద్ద జాతరకు రావాలని ఆలయ నిర్వాహకులు శనివారం స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ పద్మనాభం, ఈవో నరేందర్, అర్చకులు పాల్గొన్నారు.

జాతరకు వసతులు కల్పించాలి

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని అనంతగిరిగుట్టలో వెలసిన అనంతపద్మనాభస్వామి ఆలయ పెద్ద జాతరకు వసతులు కల్పించాలని అనంతగిరి పరిరక్షణ సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శనివారం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 11 నుంచి 25వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి వసతి, అన్నదాన కార్యక్రమంతోపాటు తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఏటా నిర్వహించే అనంతగిరి ప్రదక్షిణను అధికారికంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అనంతగిరి పరిరక్షణ సమితి ప్రతినిధులు అంజిరెడ్డి, శ్రీనివాస్, నర్సింలు, డాక్టర్ రాజశేఖర్, మోహన్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, విజయలక్ష్మి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దురలవాట్లను దరిచేరనివ్వొద్దు

ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

యాచారం: దురలవాట్లకు బానిసై.. బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధి నానక్‌నగర్ గ్రామంలో శనివారం స్థానికులతో ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగ్, పేకాట తదితర చెడు అలవాట్లు చేసుకోవద్దని సూచించారు. వాటికి బానిసైతే.. డబ్బు పోవడం, మానసికంగా కుంగిపోవడం, ఆరోగ్యం దెబ్బతిని జీవితం ఆగం అవుతుందని హెచ్చరించారు. తల్లితండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు.



ఇంటింటికీ స్టిక్కర్!



మొత్తం 56 ప్రశ్నలు సిద్ధం చేసిన జిల్లా యంత్రాంగం

- 150 నుంచి 175 ఇళ్లకో ఎన్యూమరేటర్ నియామకం
- 5,375 మంది ఉపాధ్యాయులకు విధులు
- కుల గణనపై శంషాబాద్‌లో కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం
- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు, ఇతర నేతలు డుమ్మా

సాక్షి, రంగారెడ్డిజిల్లా:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఇంటింటి, సమగ్ర కులగణన సర్వేకు రంగారెడ్డి జిల్లాలో యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారంగా..అధికారులు ఇప్పటికే సమగ్ర మ్యాప్‌ను సిద్ధం చేసుకున్నారు. సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల, విద్య, ఉపాధి వంటి 56 అంశాలను సేకరించనున్నారు. వివరాల సేకరణ అనంతరం సంబంధిత ఇళ్లకు స్టిక్కర్లు అంటించనున్నారు. రంగారెడ్డి జిల్లాలో 21 మండలాలు, 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు సహా 549 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో తొమ్మిది లక్షలకుపైగా కుటుంబాలు ఉన్నట్లు అంచనా. జిల్లా వ్యాప్తంగా 36,51,513 మంది ఓటర్లు ఉన్నారు. 18 ఏళ్లలోపు మరో 20 లక్షల మంది ఉన్నట్లు అంచనా. ఈ నెల 6 నుంచి 30 వరకు నిర్వహించనున్న ఈ ఇంటింటి సర్వేకు జిల్లా వ్యాప్తంగా 5,375 మంది ఎన్యూమరేటర్లు అవసరం ఉంటుందని అంచనా వేశారు. 150 నుంచి 175 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించనున్నారు. ఏ రోజు.. ఏ గ్రామంలో.. ఏ వార్డులో.. ఏ సమయంలో.. సర్వే చేయపట్టనున్నారనే సమాచారాన్ని ముందే ఆయా ప్రాంతాల్లోని కుటుంబ సభ్యులకు తెలియజేస్తారు. సర్వే సమయంలో కుటుంబ సభ్యులంతా ఉండాల్సిన అవసరం లేదు. ఎవరో ఒకరు ఉండి..అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబితే సరిపోతుంది. సర్వేలో భాగంగా ఎలాంటి ఫొటోలు, గుర్తింపు పత్రాలు స్వీకరించరు. సర్వేలో భాగంగా 56 అంశాలతో అధికారులు ప్రశ్నావళిని రూపొందించారు. వీటిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఆ ఎమ్మెల్యేలు గైర్హాజరు..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం శంషాబాద్‌లో నిర్వహించిన విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశానికి.. ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి.. కాంగ్రెస్‌లో చేరిన రాజేంద్రనగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ గైర్హాజరయ్యారు. అధికార పార్టీలో చేరినప్పటికీ.. ఆ పార్టీ అంతర్గత సమావేశాలకు వారు హాజరు కాకపోవడంపై చర్చనీయాంశంగా మారింది.

కులగణనతో బలహీన వర్గాలకు బాసట: శ్రీధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

శంషాబాద్: బలహీన వర్గాలకు బాసటగా నిలిచేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆలోచన మేరకు రాష్ట్రంలో కులగణన సర్వేను చేపట్టనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సామాజిక, ఆర్థిక, కులగణన సర్వేపై జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ నేతలతో పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. ఇటీవల వర్సిటీల వీసీల నియామకంలోనూ ప్రభుత్వం బలహీన వర్గాలకే ప్రాధాన్యమిచ్చిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు జరుగుతున్న కులగణన సర్వేను విజయవంతం చేయడంలో కాంగ్రెస్ శ్రేణులు కీలకంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పి. మహేందర్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకరయ్య, పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ధనుంజయ్, రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ అనితారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌గా చైతన్య



దోమ: కస్తూర్బా గాంధీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్‌గా(ఎస్ఓ) ఆర్.చైతన్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన పద్మజ బదిలీపై వెళ్లడంతో కొంతకాలంగా ఇన్‌చార్జి పాలనలో పాఠశాల కొనసాగింది. కాగా కేజీబీవీలో గణిత ఉపాధ్యాయిని చైతన్యకు ఎస్ఓగా బాధ్యతలు కల్పిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

ఉమ్మడి జిల్లా ఖోఖో జట్టుకు తాండూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న మహిపాల్‌రెడ్డి

తాండూరు: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి అండర్–17 విభాగం ఖోఖో బాలుర జట్టుకు పట్టణం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 1న నగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా జట్టు కూర్పునకు ఎంపికలు నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌లో పట్టణంలోని గౌతమి హైస్కూల్ నుంచి పదో తరగతి విద్యార్థి అనిల్ రాథోడ్, చందు యాదవ్ ఎంపికయ్యారు. నవంబర్ రెండో వారంలో నిర్వహించే రాష్ట్ర స్థాయిపోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఈ మేరకు శనివారం పాఠశాల కరస్పాండెంట్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్ సంగారెడ్డి, ప్రిన్సిపాల్ కొండారెడ్డి ఉపాధ్యాయ బృందం ఇద్దరు విద్యార్థులను అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



బొంరాస్‌పేట: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ఎండీ.అబ్దుల్ రవూఫ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని తుంకిమెట్ల శివారులో బొట్లోనితండా వైపు జాతీయ రహదారిపై ఉన్న కల్వర్టు వద్ద ఓ వ్యక్తి పడిపోయి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరకున్న పోలీసులు మృతుడికి దాదాపు 30 ఏళ్ల వయస్సు ఉంటుందని .. తలపై గాయాలు గుర్తించామన్నారు. మృతిని అసహజంగా.. అనుమానాస్పదంగా గుర్తించామని చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని కొడంగల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం



నాగభూషణ్(ఫైల్)

కందుకూరు: వెంచర్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారాం తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా ధారూరు మండలం నర్సాపూర్‌కు చెందిన కావలి నాగభూషన్(25) భార్య జ్యోతితో కలిసి కందుకుకూరులో నివసిస్తున్నాడు. స్థానిక ఎస్‌వీఎస్ వెంచర్‌లో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న నాగభూషన్ అక్టోబర్ 29న కందుకూరు చౌరస్తాలో రామాజీపేట బస్ ఎక్కాడు. తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ సైదులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 8712662687 నంబర్‌లో సమాచారం అందించాలన్నారు.

మెస్ చార్జీలు పెంపు హర్షణీయం

మంచాల: గురుకులాల సంక్షేమం, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెస్, కాస్మొటిక్స్ చార్జీలు పెంచడం హర్షణీయమని ప్రిన్స్‌పాల్ కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం నోముల మహాత్మాజ్యోతి రావు పూలే బీసీ గురుకుల కళాశాల విద్యార్థులు, అధ్యాపకబృందం కేక్ కట్‌చేసి, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు భరత్ కుమార్, మల్లేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మారుతున్న అగ్రికల్చర్



రొటావేటర్‌తో దుక్కి చదును చేస్తున్న రైతు (ఫైల్)



వరి పంటను కోస్తున్న హార్వెస్టర్ (ఫైల్)

- దుక్కి దున్నడం మొదలు పంట నూర్పిడి వరకు యంత్రాలే
- తగ్గుతున్న కాడెడ్ల వినియోగం
- ట్రాక్టర్, హార్వెస్టర్, డ్రోన్‌లతో వ్యవసాయం

దుద్యాల్: గతంలో వ్యవసాయం చేయాలంటే కాడెద్దులు, కలపతో తయారు చేసిన పరికరాలు వాడేవారు. పూర్వీకులు చేసే వ్యవసాయం సాంప్రదాయ వ్యవసాయంగా చెప్పుకొనేవారు. సాంప్రదా య వ్యవసాయానికి ఖర్చు, సమయం ఎక్కువే. పంటను కోసిన తర్వాత కల్లంలో ఉంచి ఎద్దులు, కూలీల సాయంతో నూర్పిడి చేసే ధాన్యం ఇంటికి తీసుకొచ్చేవారు. ప్రస్తుతం సాంప్రదాయ వ్యవసా యానికి సాంకేతికత తోడవ్వడంతో పుడమిని నమ్ముకున్న రైతన్నలు సాగుపై ఆలోచనలు మారుతున్నాయి. ఫలితంగా వ్యవసాయ రంగంలో వినూత్నమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అన్నదాతలు నూతన వ్యవసాయ పద్ధతులు, యాంత్రీకరణ వైపు మొగ్గు చూపుతుండడంతో అగ్రి'కల్చర్'లో మార్పు మొదలయింది.

యాంత్రీకరణతో సాగు సులభం

రైతులు యాంత్రీకరణతో సాగును సులభతరం చేసుకుంటున్నారు. వ్యవసాయ పనుల్లో యంత్ర ప్రాధాన్యత పెరిగింది. దుక్కి దున్నడం మొదలు పంట కోతలు, నూర్పిడి వరకు యంత్రాలను వినియోగిస్తున్నారు. వ్యవసాయంలో కాడెడ్ల ప్రాధాన్యత క్రమంగా తగ్గుతోంది. రోజుల తరబడి జరిగే ఈ పనులు గంటల్లోనే పూర్తి చేస్తున్నారు. దుక్కి దున్నేందుకు ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, రొటావేటర్ల వినియోగం పెరిగింది. డ్రమ్ సీడర్లతో వరి నాటేస్తున్నారు. కోత మిషన్లు, పంట నూర్పిడి యంత్రాలు వ్యవసాయాన్ని మరింత సులభతరం చేశాయి. ప్రస్తుతం మందులు పిచికారీ చేసేందుకు అధునాతన సాంకేతికతతో తయారు చేసిన డ్రోన్‌లు వాడుతున్నారు.



డ్రోన్ సాయంతో మందుల పిచికారీ (ఫైల్)

సమయం, డబ్బు ఆదా



గతంలో వ్యవసాయానికి రోజుల తరబడి పని చేయాల్సి వస్తుండేది. కాడెడ్ల సాయంతో ఎకరా పొలం దుక్కి దున్నేందుకు రోజంతా పడుతుండేది. ప్రస్తుతం ట్రాక్టర్ సాయంతో గంటలోనే ఎకరా చదును చేస్తున్నాం. వరి పంటను నూర్పిడికి పది రోజులు సమయం పడుతుండేది. ప్రస్తుతం గంటల్లో నూర్పిడి చేసి ధాన్యాన్ని ఇంటికి చేరవేస్తున్నారు. కూలీలకు ఖర్చు, సమయం ఎక్కువగా ఉండేది. యంత్రాల రాకతో ఖర్చు, సమయం తగ్గాయి.

– తుంకిమెట్ల రాజు, రైతు, హస్నాబాద్



చోరీ జరిగిన వైన్స్ ఇదే

వైన్స్‌లో చోరీ

రూ.ఐదు వేల నగదు, మద్యం సీసాలతో నిందితుడి పరారు



సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యం

పెద్దేముల్: గుర్తు తెలియని వ్యక్తులు మండల కేంద్రంలోని ఓ వైన్స్‌లో శనివారం తెల్లవారు జామున చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ గిరి తెలిపిన ప్రకారం.. మండల కేంద్రంలోని కొంతకాలంగా శ్రీ కనకదుర్గా వైన్స్ కొనసాగుతోంది. రోజు మాదిరిగానే క్యాష్ కౌంటర్ మేనేజర్ రాజు గౌడ్ శుక్రవారం రాత్రి 10 గంటలకు దుకాణానికి తాళం వేసి వెళ్లిపోయాడు. ఉదయం ఆయన షాప్ తెరచి చూడగా దుకాణంలోని సరుకులు, కాటన్ పెట్టెలు చిందర వందరగా పడిఉన్నాయి. స్టాక్ రూం డోర్, క్యాష్ కౌంటర్ తెరిచి ఉండడం గమనించాడు. సీసీ కెమెరాలు సైతం వెనక్కు తిప్పి ఉన్నాయి. కిటికీ రాడ్లు విరగ్గొట్టినట్లు గమనించిన ఆయన వెంటనే షాప్ యజమానులకు సమాచారం ఇచ్చాడు. అక్కడకు చేరుకున్న యజమానులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీసీ కెమెరాలు పరిశీలించగా తెల్లవారుజామున 2 గంటల నుంచి 2.30గంటల వరకు గుర్తు తెలియని ఓ వ్యక్తి కేవలం నెక్కర్ వేసుకుని, ముఖానికి నల్లని వస్త్రం కట్టుకుని చోరీ చేస్తున్నట్లు రికార్డు అయింది. మద్యం బాటిళ్లతో పాటుగా, రూ.ఐదు వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు పోలీసలకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

పూడూరు: పేకాడుతున్న ఆరుగురిని పోలీస్‌లు అరెస్ట్ చేశారు. ఏఎస్ఐ సత్తయ్య తెలిపిన ప్రకారం .. మండల పరిధిలోని బాకాపూర్‌లోని యూసుఫ్‌ఖాన్ వ్యవసాయ క్షేత్రంలో పేకాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు దాడి చేయడగా మన్నెగూడకు చెందిన బాయికాడి లక్ష్మయ్య, మహ్మద్ హుస్సేన్, సిరాజ్, యూసుఫ్‌ఖాన్, సయ్యద్ రవూఫ్, మహ్మద్‌తాజ్ పేకాడుతూ పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి రూ.10,500 నగదు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

మార్కెట్ అభివృద్ధికి నిధులివ్వండి

కడా ప్రత్యేక అధికారికి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్ వినతి



అంబయ్యగౌడ్‌ను సన్మానిస్తున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్ రూరల్: పట్టణంలోని మార్కెట్ యార్డులో భవన నిర్మాణంతోపాటు వ్యాపార సముదాయానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్ కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి శాలువా కప్పేందుకు ప్రయత్నించగా ప్రత్యేకాధికారి శాలువాను తీసుకొని అంబయ్యగౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రుణాలపై కఠినంగా వ్యవహరిస్తాం



మాట్లాడుతున్న హెచ్‌డీసీసీబీ జాయింట్ రిజిస్ట్రార్ సూర్యచంద్ర

హెచ్‌డీసీసీబీ జాయింట్ రిజిస్ట్రార్ సూర్యచంద్ర

బంట్వారం: దీర్ఘకాలిక రుణాలను గడువులోపు చెల్లించకుంటే శాఖా పరంగా లీగల్ చర్యలు తప్పవని హెచ్‌డీసీసీబీ జాయింట్ రిజిస్ట్రార్ సూర్యచంద్ర అన్నారు. శనివారం ఆయన బంట్వారం సహకార సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎనిమిదేళ్లగా దీర్ఘకాలిక రుణాలు చెల్లించని రైతులకు నోటీసులు జారీ చేశామన్నారు. మొదట 30 మంది రైతులను పిలిచి రుణాల చెల్లింపుల వివరాలు తెలిపామన్నారు. బంట్వారం సహకార సంఘం పరిధిలో దాదాపు 220 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీరి నుంచి సుమారు రూ.4 కోట్లకు పైగా వసూలు వసూలు చేయాల్సి ఉందన్నారు. సకాలంలో చెల్లించని రైతులకు అపరాధ వడ్డీ పడుతుందన్నారు. మొదటగా సెక్షన్ 71 ప్రకారం నోటీసులు జారీ చేసి 15 రోజుల తర్వాత హియరింగ్ చేస్తామన్నారు. అయినప్పటికీ బకాయిదారుల నుంచి సమాధానం రాకుంటే తదుపరి చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. కోఆపరేటివ్ చట్టం ప్రకారం ఆస్తులు జప్తు చేసేందుకు వెనుకాడమన్నారు. రైతులు రుణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్వో లీగల్ డీఎల్సీ రెడ్డి, మేనేజర్లు అక్షిత్, నారాయణరెడ్డి, సీఈఓ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యత పెంపునకు కృషి చేయండి



రంగారెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: అక్షరాస్యత పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్ (ఎన్ఐఎల్‌పీ) ఇంప్లిమెంటేషన్‌పై విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 71.95 శాతం అక్షరాస్యత ఉందన్నారు. అందులో 78.94 శాతం పురుషులు, 64.63 శాతం మహిళలు ఉన్నారని తెలిపారు. ఎంఈఓలు, ఎంపీడీఓలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల చివరిలోపు లిటరసీ డాటా సేకరిస్తామని చెప్పారు. ఇప్పటికే అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో మ్యాచింగ్, బ్యాచింగ్ పూర్తి చేశామని వివరించారు. ఇక్కడ 2,341 నిరక్షరాస్యులు ఉన్నారని, వీరికోసం 263 వలంటీర్లను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డీఆర్ఓ సంగీత, జిల్లా విద్యాధికారి సుశీంధర్‌రావు, డీపీఓ సురేష్ మోహన్, అధికారులు పాల్గొన్నారు.

యువజనులు ఓటు నమోదు చేసుకోవాలి

తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్ రూరల్: యువజనులంతా ఓటు ప్రాముఖ్యతను తెలుసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ బి.విజయ్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన ప్రభుత్వ డిగ్రీకళాశాల, పాత కొడండగల్ శివారులోని గురుకుల విద్యాలయాల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. నవంబర్ 9, 10 తేదీల్లో నూతన ఓటరు నమోదు, తప్పులు సరిచేసుకునేందుకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు రాంబాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం



పెద్దేముల్: మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్ ప్రసాద్



కొడంగల్ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

పెద్దేముల్: 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని పెద్దేముల్ తహసీల్దార్ బి.వెంకటేశ్‌ప్రసాద్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈ నెల 9, 10 తేదీల్లో అన్ని పంచాయతీల్లో, పోలింగ్ బూత్‌లలో కొత్త ఓటరు నమోదుతో పాటుగా మార్పులు చేర్పులు చేసుకునేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టామన్నారు. స్థానిక బీఎల్ఓలను సంప్రదించి ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మక్బుల్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల దుర్మరణం

కేశంపేట: పండుగ సెలవులు ఓ కుటుంబంలో విషాదాన్ని మిగిల్చాయి. అన్నదమ్ములు వెళ్తున్న బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో ఇరువురూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని లేమామిడి శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. కొత్తూరు మండల పరిధిలోని కోడిచర్ల తండాకు చెందిన బలరాం నాయక్, చంద్రకళ దంపతులకు ముగ్గురు సంతానం. తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తూ పిల్లలను చదివిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరి పెద్ద కుమారుడు రవి నాయక్(21) నార్సింగి సమీపంలోని ఓ కళాశాలలో బీఫార్మసీ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. రెండో కుమారుడితో పాటుగా చిన్న కుమారుడు రాకేశ్ నాయక్(19) గ్రామంలోనే కూలీ పనులు చేస్తున్నారు. ఇటీవల ట్రాక్టర్ కొనుగోలు చేసి పనులు చేస్తున్నారు. ట్రాక్టర్ సాయంతో వరి గడ్డి కట్టలు కట్టేందుకు తాడు అవసరం ఉండడంతో కల్వకుర్తిలో కొనుగోలు చేసేందుకు రవి నాయక్, రాకేశ్ నాయక్ బైక్‌పై కల్వకుర్తి వెళ్తున్నారు. లేమామిడి శివారులో బ్రిడ్జి సమీపంలో తలకొండపల్లి నుంచి మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌కు పలుగు లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ వీరి బైక్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో అన్నదమ్ములు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. అన్మదమ్ములు మృతి చెందడంతో కోడిచర్ల తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల తండ్రి బలరాం నాయక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెచ్చిపోతున్న దొంగలు

- మంతట్టిలో తాళం వేసిన ఇంటికి కన్నం
- డయల్ 100కు బాధితురాలి ఫిర్యాదు
- పట్టించుకోని పోలీసులు



మంతట్టిలో చోరీకి గురైన ఇల్లు

బషీరాబాద్: రాష్ట్ర సరిహద్దు మండలంలో దొంగలు రెచ్చిపోతున్నారు. అక్టోబర్‌లో పర్శానాయక్ తండాలో మూడు ఇళ్లలో వరుస చోరీలకు పాల్పడిన దొంగల ముఠా మంతట్టిలోనూ ఓ ఇంటికి కన్నం వేశారు. వరుస చోరీలతో మండల వాసులు ఆందోళన చెందుతున్నారు.

ట్రాక్టర్ విడిభాగాలు, నగదు అపహరణ

మండలంలోని మంతట్టిలో వెన్నెచ్చ అశోక్‌రాజు, పార్వతి దంపతులు తమ వ్యవసాయ క్షేత్రంలో ఇల్లు కట్టుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అశోక్‌రాజు వైద్య చికిత్సల నిమిత్తం అక్టోబర్ 16న హైదరాబాద్‌కు వెళ్లారు. అక్టోబర్ 25న పార్వతమ్మ ఇంటికి వచ్చింది. తాళం పగులగొట్టి ఇంట్లోని సామగ్రి చిందరవందరగా పడివేసి ఉన్నాయి. ఇంట్లో ఆమె దాచుకున్న రూ.3 వేల నగదుతో పాటుగా రూ.15 వేల విలువైన తైవాన్ పంప్‌సెట్, రూ.5 వేల విలువైన చార్జింగ్ పిచికారీ పంప్, ఇంటి ఎదుట ఉంచిన ట్రాక్టర్ విడిభాగాలు, వ్యవసాయ పనిముట్లు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి అదే రోజు డయల్ 100కు ఫోన్ చేసి చెప్పింది. సమాచారం అందుకున్న బషీరాబాద్ పోలీసులు ఫిరోజ్, అనిల్ వచ్చి వివరాలు తీసుకుని వెళ్లారు. 26న స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాని.. వారం గడుస్తున్నా పోలీసులు నేటికీ కేసు నమోదు చేయలేదని శనివారం ఆమె విలేకరులకు వెల్లడించారు.

కేసు వద్దన్నారు



చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవట్లేదు. కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని.. ఏఎస్ఐ, ఎస్ఐ ఫిర్యాదును వాపస్ తీసుకోవాలని సూచించారు. చోరీకి గురైన సామగ్రి లభ్యమైతే అప్పగిస్తాం. కేసు అవసరం లేదని చెప్పారు. ఇప్పటివరకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

– పార్వతి, బాధితురాలు

కేసు నమోదు చేస్తాం

మంతట్టిలో చోరీ విషయం డయల్ 100 నుంచి సమాచారం అందింది. తమ సిబ్బందిని పంపించి విచారణ జరిపించాం. బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు నా దృష్టికి వచ్చింది. ఆమె కేసు పెట్టాలని చెప్పలేదు. తమ సామగ్రి, నగదు ఇప్పించాలని కోరింది. కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేస్తాం.

– గఫార్, ఎస్ఐ, బషీరాబాద్

మంచు దుప్పటి



మంచు సోయగం శనివారం మండల పరిధిలోని ఎన్కేపల్లిలో కనువిందు చేసింది. ఉదయం 8గంటల వరకు పొగమంచు కప్పేసింది. నిన్నటి వరకు దంచి కొట్టిన వానలు, వెంటనే పొగ మంచు కురవడంతో పత్తి, ఉల్లికి నష్టం వాటిల్లుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

– మోమిన్‌పేట

26న చలో హైదరాబాద్

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య



మాట్లాడుతున్న జంగయ్య

అనంతగిరి: ఆసరా పెన్షన్‌దారుల పెన్షన్ పెంపునకు నవంబర్ 26న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య అన్నారు. శనివారం వికారాబాద్‌లో వీహెచ్‌పీఎస్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జంగయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. అధికారంలోకి రాగానే పెంచుతానని చెప్పిన ప్రభుత్వం పది నెలలు గడిచినా చర్యలు చేపట్టడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెన్షన్‌లను పెంచాలన్నారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈనెల 17 నుంచి 23 వరకు జిల్లా కలెక్టరేట్‌ల ముట్టడి, రిలే దీక్షలు చేపడుతామన్నారు. అప్పటికి స్పందించకుంటే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్యాం ప్రసాద్, రాష్ట్ర నాయకులు రాజు, విజయ్‌కుమార్, రాజు, రాములు, గోరయ్య, రమణాచారి, హుస్సేన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.